


# సాక్షి

ధరల్లా ఎండ మండిపోతోంది. శోభనాద్రి నోరు తడారిపోతోంది. ఒండి నిండా చెమట. ప్రపంచం బరువునంతా తనొక్కడే మోస్తున్నట్లు వొంగి వొంగి నడుస్తున్నాడు. ఎండకు జడిసి ఎవరూ రోడ్డుమీదకు రావడం లేదు. ఎండలో కంకర రోడ్డు మరీ ఎర్రగా వుంది.

"నా బతుకులాగే ఈ రోడ్డూ ఎంతకూ తరగడం లేదు" అనుకున్నాడు శోభనాద్రి విసుగ్గా. అతనికి ఎంతో దాహంగా వుంది. అంతే ఆకలిగానూ వుంది. కొంత దూరం నడిచేటప్పటికి ఒక కాలిజోడు రింగు వూడిపోయింది. శోభనాద్రికి ఒళ్ళు మండిపోయింది. చెప్పులు రెండూ రోడ్డుపక్కకు విసిరేద్దామన్నంత కోపం వచ్చింది. "ఈ చెప్పులు పోతే మళ్ళీ తను ఇంతట్లో కొనగలడా? అందాకా కాళ్ళు కాలిపోవూ?" అనుకున్నాడు.

శోభనాద్రి రోడ్డు పక్కనున్న కిళ్ళీబడ్డీ దగ్గరికెళ్ళాడు. అక్కడున్న బెంచీ మీద కూర్చున్నాడు. దాహం. సోడా తాగితే బావుండును. కానీ, పదిహేను పైసలు కావాలి. తన దగ్గర అవే లేవు. నాలికతో పెదాలు తడుపుకున్నాడు.

"బాబూ... చిన్న పురుకొస ముక్క వుంటే ఇద్దూ. జోడు రింగు వూడిపోయింది కట్టుకుంటాను" అని శోభనాద్రి సాధ్యమైనంత వినయంగా కిళ్ళీబడ్డీ ఆసామిని అడిగాడు.

"లేదు" అని ముక్తసరిగా చెప్పి, అతను కిళ్ళీలు కట్టడంలో మునిగిపోయాడు.

శోభనాద్రి చిరాగ్గా బెంచీమీంచి లేచాడు. ఊడిపోయిన చెప్పు రింగును కాలి రెండు వేళ్ళతోనూ గట్టిగా నొక్కిపట్టుకుని నెమ్మదిగా ముందుకు నడిచాడు.

"కృష్ణా, రామా అనుకుంటూ హాయిగా ఇంట్లో కూర్చుని వుండాల్సిన వయసు. అందరికీ ఆ అదృష్టం వుండొద్దూ. దేనికైనా పెట్టిపుట్టాలి. నా కృష్ణే బతికివుంటే ఇలా తిండికోసం తిప్పలు పడాల్సిన పనుండేదా? పెళ్ళయిన రెండేళ్ళకే కృష్ణకీ లోకంతో రుణం తీరిపోయింది. చిన్నప్పుడే వాళ్ళమ్మ చనిపోతే, వాడిని తనే పెంచి, పెద్ద చేశాడు. తన ప్రేమనంతటినీ వాడిమీదే చూపాడు. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం దొరికినప్పుడు, చిట్టి తండ్రి ఎంతగానో సంబరపడిపోయాడు. "నాన్నా! నువ్వింక ఏ పనీ చేయొద్దు. హాయిగా ఇంట్లో కూర్చుని విశ్రాంతి తీసుకో" అన్నాడు కృష్ణ. వాడు మాత్రం శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాడు.

కారు హారన్ విని శోభనాద్రి గబుక్కున రోడ్డు పక్కకు తప్పుకున్నాడు. దుమ్ము రేపుకుంటూ కారు జోరుగా వెళ్ళిపోయింది.

శోభనాద్రి కాసేపు ముక్కు మూసుకుని నిలబడ్డాడు. దుమ్ముకాస్త తగ్గిన తర్వాత ముందుకు కదిలాడు. నడవగా నడవగా రిజిస్ట్రార్ ఆఫీస్ వచ్చింది. మాసిన తెల్లచొక్కా కొసతో ముఖం తుడుచుకున్నాడు శోభనాద్రి. రిజిస్ట్రార్ ఆఫీసు ఆవరణలోకి నడిచాడు.

ఆఫీసుకు ఉత్తరంగా వున్న రేకుల షెడ్డు హడావుడిగా వుంది. భూములూ, ఇళ్ళూ, ఇళ్ళ స్థలాలూ కొనుక్కున్న వాళ్ళు గుంపులు గుంపులుగా వున్నారు. వాళ్ళల్లో కొందరి ముఖాలు వెలిగిపోతున్నాయి. మరికొందరి మనసులు నలిగిపోతున్నాయి.

రేకుల షెడ్‌లో ఓ మూల దస్తావేజులు రాస్తూ రామనాథం చాలా బిజీగా వున్నాడు. ఒంచిన తలెత్తకుండా రాసేస్తున్నాడు. శోభనాద్రి రేకుల షెడ్‌లోకి వెళ్ళి గోడకు జేరబడి కూర్చున్నాడు. ఆయాసం. ఒక పక్క దాహం. మరోపక్క ఆకలి. ఎండలో పడిరావడంతో కళ్ళు బైర్లు కమ్మాయి.

"నాన్నా... మరి నీకో" అంటూ తన ఒళ్ళో కూర్చున్న వరాల తండ్రి, ముద్దుల కృష్ణుడు తన నోటికి అన్నం ముద్ద అందించేవాడు. తను కృష్ణకు అన్నం తినిపించినప్పుడల్లా చిట్టి చేతితో తనకో ముద్ద అన్నం పెట్టేవాడు. తను అప్పుడు వాణ్ణి ముద్దుపెట్టుకునేవాడు. తండ్రి ప్రేమను వాడు చిన్నవయస్సులోనే ఎంత బాగా గుర్తించాడో. తన కళ్ళముందే తన కృష్ణ కరిగిపోయాడు...

శోభనాద్రి కళ్ళు తెరచి రామనాథం వంక చూశాడు. అతను దస్తావేజులు రాయడంలో నిమగ్నమైపోయివున్నాడు. శోభనాద్రి కాళ్ళు ముడుచుకుని చేతులతో కాళ్ళు నొక్కుకున్నాడు. నొప్పి.

అంతలో రామనాథం శోభనాద్రిని చూశాడు. శోభనాద్రి వెంటనే నమస్కారం చేశాడు.

రామనాథం తన పార్టీవైపు చూసి 'అదిగోనండి.. ఆయన సాక్షి సంతకం చేస్తాడు' అని శోభనాద్రిని చూపించాడు. భూమి కొనుక్కుని, రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చిన వెంకట్రావు 'అలాగే' అని తలూపి, శోభనాద్రి వంక చూశాడు. శోభనాద్రి ముఖానికి నవ్వు పులుముకొని వెంకట్రావుకు నమస్కారం చేసి, 'బాగున్నారా బాబూ' అని పలకరించాడు. వెంకట్రావు హుందాగా తలూపాడు.

"హమ్మయ్య! రెండు రూపాయలు దొరుకుతాయి. ఇదికాక, ఇంకో పార్టీ దొరికతే సాయంత్రం భోజనమే చేసెయ్యవచ్చు" అనుకున్నాడు శోభనాద్రి. నోరూరుంది.

"సోడా.. సోడా" అని అరుస్తూ ఓ కుర్రాడు వచ్చాడు. వెంకట్రావు రెండు సోడాలు ఇమ్మని, ఒకటి తను తాగి, రెండోది తనకు భూమిని అమ్మినతనికి ఇచ్చాడు. కనీసం రామనాథంనైనా తీసుకుంటారా అని అనలేదు.

"ఈ వెంకట్రావు ఈ ఏడెనిమిదేళ్ళలోనూ ఎంత మారిపోయాడు. ప్రతి ఏడూ పొలమో, ఇల్లో కొంటూనే వున్నాడు. రేటు పెరిగాక అమ్ముతూనే వున్నాడు. మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఎంతో కలివిడిగా వున్నాడు. అప్పుడాయన సైకిలుకు పంచర్‌పడితే, తనను బాగు చేయించుకుని రమ్మన్నాడు. టీ ఇప్పించాడు. తను సాక్షి సంతకం చేసినందుకు రెండు రూపాయలు అడిగితే, మూడు రూపాయలు ఇచ్చాడు. తర్వాత, ఓ రెండేళ్ళకు మోపెడ్ మీద వచ్చాడు. కొన్న ఇల్లును రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తను మూడు రూపాయలు అడిగితే రెండు రూపాయలే ఇచ్చాడు. ఈ మధ్య మోటార్ సైకిలు మీద తిరుగుతున్నాడు. మెడలో బంగారం గొలుసు మెరుస్తోంది. ఆస్తి బాగా సంపాదించాడు. ఇంత ఇమ్మని తను అతన్ని అడగడం మానేశాడు. అతనెలాగూ రెండు రూపాయలకంటే ఎక్కువ ఇవ్వడు" అని వెంకట్రావు గురించి శోభనాద్రి అనుకున్నాడు.

"దస్తావేజులు రిజిస్ట్రార్ గారికి చూపించి వస్తానుండండి" అని రామనాథం ఆఫీసులోకి వెళ్ళి, పదినిమిషాల్లో తిరిగివచ్చాడు.

"ఇంకో నలభయి రూపాయల స్టాంపు పేపర్లు కావాలి" అన్నాడు రామనాథం వెంకట్రావుతో.

"అదేంటయ్యా! ముందే సరిగ్గా కనుక్కోనక్కరలేదా?".

"నిన్నటి నుంచి స్టాంపు డ్యూటీ పెరిగిందట. ఇప్పటిదాకా నాకూ తెలీదు. త్వరగా రండి మరి. ఆ స్టాంపు పేపర్లమీద కూడా రాయాలి. ఆలస్యమయితే రిజిస్ట్రార్ గారు ఇంటికెళ్ళిపోతారు" అన్నాడు రామనాథం తొందరచేస్తూ.

వెంకట్రావు చిరాకుపడుతూ డబ్బు ఇచ్చాడు. రామనాథం స్టాంపు పేపర్లు కొనడానికి బయటకు వెళ్ళాడు.

"ఇది ఎప్పటికి పూర్తవుతుందో, ఏమిటో" అనుకున్నాడు శోభనాద్రి నీరసంగా. వంగిపోయిన నడుంను మళ్ళీ గోడకు ఆన్చి, మోకాళ్ళమీద తలపెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు. మాసిన గెడ్డం మోకాళ్ళకు గుచ్చుకుంది. దాంతో తలెత్తి రేకుషెడ్ లోని జనాన్ని కాస్తసేపు చూసి, గోడకు జేరబడి ఆలోచనల్లో పడ్డాడు.

కోడలు సుందరమ్మ గుర్తొచ్చింది. సుందరమ్మ తనింట్లోనే వుంటే ఎంత బావుండేది. హు.. కృష్ణపోయిన ఏడాదికే మరో పెళ్ళి చేసుకుంది. ఎంత స్వార్థం? ఛ... ఛ... తనకి ఇవేళ ఇలాంటి ఆలోచన్లు వస్తున్నాయేమిటి? సుందరమ్మ మంచి పనే చేసింది. తను ఇక్కడున్నంతకాలం నన్ను ఎంత అభిమానంగా చూసేది. సొంత కూతురిలాగే వుండేది. 'ఇంకో పెళ్ళి చేసుకోమంటారా?' అని ఆమె తనతో ఎంత సిగ్గుపడుతూ, భయపడుతూ అడిగింది. 'చేసుకో అమ్మా' అని తను మనస్ఫూర్తిగా అన్నాడు. మారుమనువాడాక సుందరమ్మ అప్పుడప్పుడూ భర్తతో వచ్చి తనను చూసి వెళ్ళేది. ఈమధ్య రావడం మానేసింది. దూరంగా వుంటే అభిమానాలూ, ఆప్యాయతలూ తగ్గిపోతాయేమో? తన పిచ్చిగానీ, ఇప్పుడు ఆమెకూ, తనకూ ఏ బాంధవ్యముందని.....

"గోపాలం బావా, గోపాలం బావా" అన్న వెంకట్రావు పిలుపు విని శోభనాద్రి అటు వేపు చూశాడు.

వెంకట్రావు రేకుల షెడ్ దగ్గర పిట్టగోడ మీంచి రోడ్డుమీదకు చూస్తూ గట్టిగా పిలుస్తున్నాడు. వెంకట్రావు పిలిచిన గోపాలం లోపలికి వచ్చాడు.

"బహుకాల దర్శనం, ఎక్కడికి వెళ్తున్నావ్?"

"మీ ఊరే బయలుదేరాను. మళ్ళీ పొలమో, ఇల్లో కొన్నావన్నమాట. పిల్లలు కూడా లేరు. ఈ సంపాదనంతా ఏం చేస్తావు బావా? నన్ను పెంచుకోకూడదూ?" అన్నాడు గోపాలం హాస్యమాడుతూ.

"ఏం సంపాదనలేద్దూ" అన్నాడు వెంకట్రావు.

ఇద్దరూ కబుర్లలోపడ్డారు. శోభనాద్రి వాళ్ళిద్దర్నీ కొంచెం సేపు చూసి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. కడుపు ఆవురావురుమంటోంది.

రామనాథం స్టాంపు పేపర్లు పట్టుకుని వచ్చి, మళ్ళీ రాతలో పడిపోయాడు. రాయడం అయ్యాక,

"అయ్యా...రండి. ఇక్కడ సంతకం చెయ్యండి. తర్వాత సాక్షి సంతకం చేయిద్దాం" అన్నాడు రామనాథం వెంకట్రావుకు భూమిని అమ్మినతనితో.

శోభనాద్రి గబుక్కున కళ్ళు తెరిచాడు. సర్దుకుని కూర్చున్నాడు.

"ఇంకో రెండు నిమిషాల్లో తను 'తలాటం శోభనాద్రి సాక్షి వ్రాలు' అని సంతకం చేసేస్తాడు. డబ్బులు చేతి కొస్తాయి. ఏదైనా తినొచ్చు" అనుకున్నాడు శోభనాద్రి.

"గోపాలం బావా... ఓ అరగంట ఓపికపట్టు. ఈ పని అయిపోయాక, నా మోటార్ సైకిల్ మీద నిన్ను తీసుకుపోతాను" అన్నాడు వెంకట్రావు.

సంతకం చేస్తూ ఆ మాటలు విని డీలా పడిపోయాడు వెంకట్రావుకు భూమిని అమ్మినతను.

"వచ్చేటప్పుడు మోటారు సైకిల్‌మీద నన్ను తీసుకొచ్చి, ఇప్పుడు నన్ను వదిలేస్తున్నాడు. ఇవేళ నాకు ఒంట్లో బాగోలేదు. ఇంకోనాడు రిజిస్ట్రేషన్ చేయించుకుందువు గాని అని తనంటే, ఇవేళ మంచిరోజంటూ తీసుకొచ్చి, ఇప్పుడిలా చేస్తున్నావా? ఎంతకైనా తగుదువురా వెంకట్రావు" అని మనసులో తిట్టుకున్నాడతను.

"ఆ...ఇక సాక్షి సంతకం చేస్తే, మనం రిజిస్ట్రార్ గారి దగ్గరకెళ్ళొచ్చు. అక్కడ కూడా సాక్షి సంతకం కావాలి కాబట్టి శోభనాద్రిని తీసుకుపోదాం. శోభనాద్రీ... ఇలా వచ్చి సంతకం చెయ్యి అన్నాడు రామనాథం.

"ఇక అతనెందుకయ్యా. మా గోపాలం బావ ఉన్నాడు కదా. రావోయ్ బావా.. కాస్త సాక్షి సంతకం చెయ్యి" అని పిలిచాడు వెంకట్రావు.

శోభనాద్రి గుండెలో రాయిపడింది. రామనాథాన్నీ, వెంకట్రావునూ, ఆయన బావ గార్నీ తేరిపార చూశాడు. అతని నవనాడులూ కుంగిపోయాయి. రామనాథం తప్ప ఇంకెవరూ శోభనాద్రిని పట్టించుకోలేదు.

శోభనాద్రి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆకలి మరీ ఎక్కువయ్యింది. "ఇవేళ తనకు తిండి తినే యోగం లేనట్టుంది" అనుకున్నాడు. "ఇప్పుడెలా? ఎవరినన్నా అడిగితే. ఛీ ఛీ.. అడుక్కోడమా" అని మళ్ళీ అనుకున్నాడు.

"మధ్యాహ్నం మరో పార్టీ రాక పోతుందా? రాత్రికైనా కాస్త తిండి తినకపోతానా?" శోభనాద్రి కాలిన కడుపు మళ్ళీ ఆశపడింది.

పైన సూర్యుడింకా మండిపోతూనే వున్నాడు.

*జూన్ 1985, విపుల మాసపత్రిక*